క్లుప్తంగా

దరఖాస్తుల ఆహ్వానం

కేసముద్రం: మండలంలోని కల్వల మోడల్ స్కూల్‌లో పదో తరగతి, ఇంటర్మీడియట్ విద్యార్థులకు గంటల ప్రాతిపాదికన ఇంగ్లిష్ బోధించేందుకు అర్హుల నుంచి దరఖాస్తు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ పరిమి నవీన్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 3, 4వ తేదీల్లో డెమో తరగతులు ఉంటాయని, ఈ మేరకు ఎంఏ ఇంగ్లిష్, బీఈడీ ఉత్తీర్ణులైన వారు తమ ఒరిజినల్ సర్టిఫికెట్లతో హాజరుకావాలని కోరారు.

కేసీఆర్ ఫోన్‌తో హైదరాబాద్‌కు..

- హుటాహుటిన వెళ్లిన సత్యవతి, కవిత

డోర్నకల్: డోర్నకల్‌లో మంగళవారం వినాయక పూజల్లో పాల్గొన్న మాజీ మంత్రి సత్యవతి రాథోడ్, మాజీ ఎంపీ మాలోత్ కవిత హడావిడిగా హైదరాబాద్‌కు వెళ్లారు. స్థానిక ఇందిరాగనర్‌లో వినాయక మండపం వద్ద కమిటీ ప్రతినిధుల ఆహ్వానం మేరకు సత్యవతిరాథోడ్, కవిత పూజల్లో పాల్గొన్నారు. అదేసమయంలో మాజీ సీఎం కేసీఆర్ నుంచి ఫోన్ రావడంతో పక్కకు వెళ్లి మాట్లాడారు. ఫోన్‌లో కేసీఆర్‌తో పాటు కేటీఆర్ మాట్లాడి తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కవితను పార్టీ నుంచి సస్పెండ్ చేయడంపై సత్యవతి, కవిత అభిప్రాయం అడిగినట్లు ఫోన్ సంభాషణ ద్వారా తెలిసింది. కేసీఆర్ పిలుపు మేరకు సత్యవతిరాథోడ్, కవిత హడావిడిగా హైదరాబాద్ వెళ్లారు.

డీఈఓకు సన్మానం



మహబూబాబాద్ అర్బన్: జిల్లా విద్యాశాఖ అధికారిగా బాధ్యతలు స్వీకరించిన దక్షిణమూర్తిని టీఎన్జీఓఎస్ ఉద్యోగ సంఘం జిల్లా అధ్యక్ష కార్యదర్శులు గణేష్, ముజాహిద్ అలీ, జిల్లా బాధ్యులు మంగళవారం జిల్లా కార్యాయంలో మార్యదపూర్వకంగా కలిసి సన్మానించారు. కార్యక్రమంలో యూనియన్ అసోసియేట్ అధ్యక్షుడు శ్రీనివాస్, సభ్యులు శ్రీనివాస్, రమేష్ తదితరులు పాల్గొన్నారు. టీఎస్‌జీహెచ్‌ఎంలు బొకేను అందజేసి సన్మానించారు. ఏసీజీఈ మందుల శ్రీరాములు, జిల్లా అధ్యక్షుడు ఇస్లావత్ లచ్చిరాంనాయక్, ఎఫ్ఏఓ శంకర్, డీసీఈబీ సెక్రటరీ బాలాజీ నాయక్ పాల్గొన్నారు.

స్ట్రీట్ ఫుడ్ ఫెస్టివల్

డోర్నకల్: డోర్నకల్ మున్సిపల్ పరిధిలోని గాంధీ సెంటర్‌లో మంగళవారం మెప్మా ఆధ్వర్యంలో స్ట్రీట్ ఫుడ్ ఫెస్టివల్ నిర్వహించారు. మెప్మా ఆర్పీలు తయారు చేసిన వివిధ రకాల వంటకాలను ఈ ఫెస్టివల్‌లో విక్రయించారు. బేకరీల్లో ఆహార పదార్థాలకంటే ఇంట్లో తయారు చేసిన ఆహార పదా ర్థాలే ఆరోగ్యకరమని అవగాహన కల్పించేందుకు ఈకార్యక్రమం నిర్వహించినట్లు తెలిపారు.

యూరియా తెప్పిస్తాం..

కేసముద్రం: మండలానికి కావాల్సిన యూరియా తెప్పించే ప్రయత్నం చేస్తున్నామని కేసముద్రం మార్కెట్ చైర్మన్ గంట సంజీవరెడ్డి అన్నారు. మంగళవారం కేసముద్రం వ్యవసాయ మార్కెట్ కార్యాలయంలో ధన్నసరి, కేసముద్రం పీఏసీఎస్ చైర్మన్‌లు మర్రి రంగారావు, దికొండ వెంకన్న అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. టోకెన్ విధానాన్ని రద్దు చేసి, రైతు భరోసా పోర్టల్ ద్వారా రెవెన్యూ గ్రామాల్లో పట్టాదారు పాసుబుక్కు సీరియల్ నెంబర్ ప్రకారంగా యూరియాను అందించనున్నట్లు తెలిపారు. కాగా కాట్రపల్లిలో రైతుభరోసా లిస్ట్ ప్రకారంగా 222 మంది రైతులకు మంగళవారం యూరియా అందించినట్లు ఏఓ వెంకన్న తెలిపారు. సమావేశంలో ఎస్సై మురళీధర్ రాజు, సీఈఓలు, డైరెక్టర్లు పాల్గొన్నారు.

'అక్రమ కేసులు ఎత్తివేయాలి'

నెహ్రూసెంటర్: సీపీఐ నాయకులు, కార్యకర్తలపై నాటి బీఆర్‌ఎస్ ప్రభుత్వం పెట్టిన అక్రమ కేసులను వెంటనే ఎత్తివేయాలని మున్సిపల్ మాజీ ఫ్లోర్‌లీడర్ అజయ్‌సారథిరెడ్డి డిమాండ్ చేశారు. ఆర్టీసీ ఉద్యమ కేసులో మంగళవారం కోర్టుకు హాజరైన సందర్భంగా అంబేద్కర్ సెంటర్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. చింతకుంట్ల వెంకన్న, రేషపల్లి నవీన్, సాంబలక్ష్మి, శ్రావణ్, ఫాతిమా, పాల్, మంద శంకర్, పద్మ తదితరులు పాల్గొన్నారు.

వర్షానికి కూలిన ఇల్లు

డోర్నకల్: మూడు రోజులుగా కురుస్తున్న వర్షాలతో స్థానిక పంపుబావితండాలో రోజువారీ కూలి బానోత్ సుమిత్రకు చెందిన ఇల్లు భారీ వర్షంతో మంగళవారం కూలింది. కాంగ్రెస్ నాయకులు కూలిన ఇంటిని పరిశీలించి సుమిత్రను పరామర్శించారు.

ఎంపిక

గార్ల: పంజాబ్ రాష్ట్రం లుథియానాలో నిర్వహించే 75వ జాతీయస్థాయి బాస్కెట్‌బాల్ పోటీలకు గార్లకు చెందిన ఉప్పర వివేక్‌సిద్ధార్థ ఎంపికైనట్లు మండల బాస్కెట్‌బాల్ అసోసియేషన్ సెక్రటరీ సూత్రపు జయశంకర్ మంగళవారం తెలిపారు. తెలంగాణ తరఫున జాతీయస్థాయి పోటీలకు ఎంపికైన వివేక్‌సిద్ధార్థను కోచ్‌లు పీడీ రామన్న, సీఐ నటేష్, హెచ్‌ఎం శీలంశెట్టి వెంకటేశ్వర్లు, ఉప్పర శ్రీనివాస్, రాము, ప్రశాంత్, ఉమేష్, శేఖర్, చంద్రశేఖర్, ఆశీష్‌జైన్ తదితరులు అభినందించారు.

సాగునీరు పారేదెట్లా..?

- కాల్వల్లో పెరిగిన చెట్లు
- ధ్వంసమైన కాల్వలు
- మరమ్మతులు చేయాలంటున్న రైతులు



కాల్వలో పెరిగిన గడ్డి, తుమ్మ చెట్లు



కాల్వను కమ్మేసిన చెట్లు

కురవి: కురవి, సీరోలు మండలాల్లోని వివిధ గ్రామాల్లో ఉండే ఎస్సారెస్పీ కాల్వలు పనికిరాకుండా ఉన్నాయి. కొన్ని గ్రామాల్లో ఎస్సారెస్పీ డీబీఎం-48 కాల్వల్లో దట్టంగా పెద్ద చెట్లు పెరిగి కాల్వల ఆనవాళ్లు కనిపించకుండా అల్లుకున్నాయి. కాల్వల్లో మురికి, తుమ్మ చెట్లు, పెద్ద చెట్లు, గడ్డి దట్టంగా పెరగడంతో కాల్వలకు సైడ్‌లో ఉన్న సిమెంట్ పెచ్చులూడి పోతోంది. కురవి, బలపాల, మొగిలిచర్ల, కాంపల్లి తదితర గ్రామాల్లో ఎస్సారెస్పీ కాల్వల్లో ఈ సమస్య మరీ ఎక్కువ ఉంది. ప్రభుత్వం ఎస్సారెస్పీ కాల్వల ద్వారా గోదావరి జలాలను విడుదల చేస్తే ఈ కాల్వల్లో పారడం కష్టమేనని రైతులు పేర్కొంటున్నారు. కాల్వల ద్వారా నీరు గ్రామాల్లోని చెరువులకు చేరడం కష్టంగా మారుతోంది. కాల్వల్లో పెరిగిన చెట్లు, గడ్డి, మురికి తుమ్మ చెట్లను తొలగించకుంటే కాల్వలు పూర్తిగా పగుళ్ల ఏర్పడి ఉపయోగపడకుండాపోయేలా ఉన్నాయి. చాలాచోట్ల కాల్వకు సైడ్‌లో ఉన్న సిమెంట్ కాంక్రీట్ పగిలిపోయి ధ్వంసమయ్యాయి. గ్రామాల్లోని చెరువులకు నీటిని సరఫరా చేసే తూముల్లో మట్టి, గడ్డి పెరిగి నీటి సరఫరా కష్టంగా మారింది.

చెట్లను తొలగించాలి..



ఎస్సారెస్పీ కాల్వల్లో పెరిగిన చెట్లు, గడ్డిని తొలగించాలి. కాల్వలకు సైడ్‌లో ఉన్న సిమెంట్ దెబ్బతిని పోతుంది. పగుళ్ల ఏర్పడిన చోట మరమ్మతులు చేయాలి. కాల్వల్లో నీళ్ల పారేలా చర్యలు చేపట్టాలి.

– దూదికట్ల సారయ్య, రైతు

పాలకుల అసమర్థతతోనే యూరియా కొరత

- గౌని ఐలయ్య



సమావేశంలో మాట్లాడుతున్న ఐలయ్య

గార్ల: కేంద్ర, రాష్ట్ర పాలకుల అసమర్థతతోనే రాష్ట్రంలో యూరియా కొరత ఏర్పడిందని న్యూడెమోక్రసీ పార్టీ జిల్లా కార్యదర్శి గౌని ఐలయ్య ఆరోపించారు. మంగళవారం పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. వ్యవసాయ రంగానికి సరిపడా యూరియా అందించడంలో పాలకులు పూర్తిగా విఫమయ్యారని అన్నారు. సమావేశంలో డివిజన్ కార్యదర్శి నందగిరి వెంకటేశ్వర్లు, సక్రు, గౌని భద్రయ్య, వీరభద్రం, గణేష్, మల్లేష్, మాన్య, భద్రాజీ పాల్గొన్నారు.

విమర్శలతోనే కాలం గడుపుతున్నారు

బయ్యారం: కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చి రెండు సంవత్సరాలు గడిచినా ఇంకా గత పాలకులపై విమర్శలు చేస్తూ కాంగ్రెస్ నాయకులు కాలం గడుపుతున్నారని న్యూడెమోక్రసీ జిల్లా కార్యదర్శి గౌని ఐలయ్య ఆరోపించారు. మండల కేంద్రంలోని ఆ పార్టీ కార్యాలయంలో మంగళవారం నిర్వహించిన జనరల్‌బాడీ సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో యూరియా దొరకక రైతులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. పథకాల అమలును కాంగ్రెస్ పట్టించుకోవడంలేదన్నారు. గ్రామాల్లో వైద్యశిబిరాలు ఏర్పాటు చేయకపోవడం సరికాదన్నారు. బండారి ఐలయ్య, వెంకటేశ్వర్లు, నాగేశ్వరరావు, పద్మ, వీరభద్రం, భిక్షం, వెంకన్న పాల్గొన్నారు.

బైండోవర్

బయ్యారం: మండలంలోని వినోభానగర్‌లో సారా తయారీకి పాల్పడుతున్న ముగ్గురిని ఎక్సైజ్‌పోలీసులు తహసీల్దార్ నాగరాజు ఎదుట మంగళవారం బైండోవర్ చేశారు. గ్రామానికి చెందిన బోడ కోబల్, బానోత్ సాలి, బానోత్ అచ్చమ్మ.. సారా తయారీ చేస్తుండగా ఎక్సైజ్ పోలీసులు పట్టుకున్నారు. ఇక నుంచి సారా తయారీ చేస్తే రూ.లక్ష జరిమానా, జైలుశిక్షను తప్పదని తహసీల్దార్ పేర్కొన్నారు.

కాళేశ్వరం రిపోర్టు పూర్తిగా అబద్ధం



ఆందోళనలో పాల్గొని ప్రసంగిస్తున్న దయాకర్‌రావు



రాస్తారోకో చేస్తున్న బీఆర్‌ఎస్ నాయకులు

- మాజీ మంత్రి దయాకర్‌రావు

తొర్రూరు: కాళేశ్వరం ప్రాజెక్టుపై పీసీ ఘోష్ రిపోర్టు పచ్చి అబద్ధమని మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు అన్నారు. కాళేశ్వర ప్రాజెక్టు విషయంలో కేసీఆర్‌పై అవినీతి ఆరోపణలు చేయడాన్ని నిరసిస్తూ బీఆర్‌ఎస్ ఆధ్వర్యంలో మంగళవారం డివిజన్ కేంద్రంలోని బస్టాండ్ సెంటర్‌లో జాతీయ రహదారిపై బైఠాయించారు. మాజీ మంత్రి దయాకర్ రావు నిరసనలో పాల్గొని ప్రభుత్వ తీరును ఎండగట్టారు. కాళేశ్వరం ప్రాజెక్టు విషయంలో కేసీ ఆర్, బీఆర్‌ఎస్‌పైనే దాడి జరుగడం కాదని, ప్రాజెక్టును పూర్తిగా మూసేసి ఎండబెట్టేందుకు ప్రభుత్వం యత్నిస్తుందన్నారు. యూరియా కొరత నేపథ్యంలో జిల్లా వ్యవసాయధికారితో ఎర్రబెల్లి మాట్లాడారు. బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు పసుమర్తి సీతారాములు, శ్రీనివాస్, చిన్నఅంజయ్య, ప్రదీప్‌రెడ్డి, సునిల్ రెడ్డి, కాలునాయక్, ఐలయ్య పాల్గొన్నారు.

సీబీఐకి అప్పగించడం సరికాదు

మహబూబాబాద్/గార్ల: కాళేశ్వరం ప్రాజెక్టుపై విచారణను సీబీఐకి అప్పగించడం సరికాదని మాజీ ఎమ్మెల్యే శంకర్‌నాయక్ అన్నారు. బీఆర్‌ఎస్ పార్టీ ఆధ్వర్యంలో మంగళవారం మానుకోట తహసీల్దార్ కార్యాలయం సెంటర్‌లో రాస్తారోకో, గార్లలో నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపారు. ఈసందర్భంగా శంకర్ నాయక్ మాట్లాడుతూ.. కాళేశ్వరం ప్రాజెక్ట్ విషయంలో కాంగ్రెస్ ప్రభుత్వం కుట్ర చేస్తుందన్నారు. బీజేపీ, కాంగ్రెస్ కుమ్మక్కై కుట్రలు చేస్తుందని అన్నారు. నాయకులు రంజిత్, మహ్మద్ ఫరీద్, లూనావత్ అశోక్, రవి, ఆవుల వెంకన్న, శేషారెడ్డి, రాజు, గంగావత్ లక్ష్మణ్‌నాయక్, రాధాకృష్ణ, శీలంశెట్టి రమేష్, మురళి, ఖదీర్ పాల్గొన్నారు.

కాంగ్రెస్ వి కక్షపూరిత రాజకీయాలు

బయ్యారం: కాంగ్రెస్ పార్టీ కక్షపూరిత రాజకీయాలతో ప్రజల దృష్టిని మళ్లించే ప్రయత్నం చేస్తుందని మాజీ ఎమ్మెల్యే హరిప్రియనాయక్ అన్నారు. మంగళవారం బయ్యారంలో అంబేద్కర్ విగ్రహం వద్ద మాజీ జెడ్పీ చైర్‌పర్సన్ బిందుతో కలిసి నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపారు. అంబేద్కర్ విగ్రహానికి వినతిపత్రం అందజేసి, మాట్లాడారు. గణేష్, శ్రీకాంత్, సత్యనారాయణ, ఐలయ్య పాల్గొన్నారు.

జననేత వైఎస్సార్‌కు ఘననివాళి

ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి, దివంగత నేత వైఎస్ రాజశేఖరరెడ్డి వర్ధంతి సందర్భంగా మంగళవారం జిల్లా వ్యాప్తంగా అభిమానులు, వివిధ పార్టీల నాయకులు, కార్యకర్తలు ఘనంగా నివాళులర్పించారు. సీఎంగా పనిచేసిన కాలంలో ఆయన ప్రజల కోసం అమలు చేసిన సంక్షేమ కార్యక్రమాలను గుర్తు చేసుకున్నారు.

– సాక్షి నెట్‌వర్క్



మహబూబాబాద్ రూరల్: పొలంలో వైఎస్ఆర్‌కు నివాళులర్పిస్తున్న రాములునాయక్, రైతులు



గూడూరు: గుండెంగలో నివాళులర్పిస్తున్న అభిమానులు



బయ్యారం: పండ్లు పంచుతున్న నాయకులు



కురవి: కొత్తూరులో..



కొత్తగూడలో..

రోడ్లకు మరమ్మతు చేయాలి

నెల్లికుదురు: మండలంలోని వివిధ గ్రామాల్లో ద్వంసమైన రోడ్ల మరమ్మతులు చేపట్టాలని సీపీఎం మండల కార్యదర్శి ఇస్సంపల్లి సైదులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ మేరకు ఎంపీడీఓ కార్యాలయంలో జూనియర్ అసిస్టెంట్ మధుకు సీపీఎం ఆధ్వర్యంలో మంగళవారం వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. రోడ్లన్ని గుంతలమయంగా మారి గ్రామస్తులు ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. గుంతల్లో నీరునిలిచి సీజనల్ వ్యాధులు ప్రభలే ప్రమాదం ఉందని తెలిపారు. పెరుమాండ్ల బాబు గౌడ్, పుల్లయ్య, వెంకన్న, మహేందర్, సైదులు, వెంకటయ్య, రవిందర్, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలకు డిజిటల్ టీవీ బహూకరణ



వెంకటాచారి బహూకరించిన డిజిటల్ టీవీ

మహబూబాబాద్ రూరల్ : కంబాలపల్లి ప్రాథమిక పాఠశాలకు పూర్వ విద్యార్థి శివకోటి వెంకటాచారి రూ.30 వేల విలువగల డిజిటల్ టీవీని బహూకరించారు. ఆయన తండ్రి నర్సయ్య జ్ఞాపకార్థం వెంకటాచారి రామసహాయం శ్రీధర్ రెడ్డి చొరవతో కొలిశెట్టి సత్యనారాయణ, శ్రీధర్ రెడ్డి చేతుల మీదుగా ప్రధానోపాధ్యాయురాలు గుగులోత్ లక్ష్మికి మంగళవారం టీవీని అందజేశారు. ఈ సందర్భంగా కంబాలపల్లి హై స్కూల్ కాంప్లెక్స్ హెచ్‌ఎం డోలి గిరిజ మాట్లాడుతూ పాఠశాలలో ఏఐ తరగతులు, డిజిటల్ తరగతుల బోధనకు ఉపయోగపడే స్మార్ట్ టీవీని బహూకరించడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో హెచ్‌ఎం లక్ష్మి, కంబాలపల్లి ఉన్నత, ప్రాథమిక పాఠశాలల ఉపాధ్యాయులు ఉప్పలయ్య, వెంకటేశ్వర్లు, ఆవునూరి రవి, శ్రీజ, అమ్మ ఆదర్శ పాఠశాల చైర్మన్ అలివేలు పాల్గొన్నారు.

అన్నదానం.. హోమం

జిల్లా వ్యాప్తంగా వినాయక నవరాత్రి ఉత్సవాలు కొనసాగుతున్నాయి. ఈనేపథ్యంలో మంగళవారం జిల్లాలోని ప్రాంతాల్లో ఏర్పాట్లు చేసిన గణపయ్య మండపాల వద్ద నిర్వాహకులు అన్నప్రసాద వితరణ, హోమాలు, కుంకుమ పూజలు నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో హాజరయ్యారు.

– సాక్షి నెట్‌వర్క్



పెద్దవంగరలో పూజలు చేస్తున్న భక్తులు



కేసముద్రం: అమీనాపురంలో హోమంలో పాల్గొన్న భక్తులు



డోర్నకల్: వంటకాలను వడ్డిస్తున్న మాజీ మంత్రి సత్యవతి రాథోడ్, మాజీ ఎంపీ కవిత

పెండింగ్ స్కాలర్‌షిప్‌లు విడుదల చేయాలి



కలెక్టరేట్ ఎదుట ఆందోళన చేస్తున్న ఎస్ఎఫ్ఐ నాయకులు, విద్యార్థులు

మహబూబాబాద్: పెండింగ్ స్కాలర్‌షిప్‌లను విడుదల చేయాలని ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్ష, కార్యదర్శి గందసిరి జ్యోతిబసు, పట్ల మధు డిమాండ్ చేశారు. ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో మంగళవారం కలెక్టరేట్ ఎదుట ఆందోళన చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చి 20 నెలలు దాటినా నేటికీ స్కాలర్‌షిప్‌లు విడుదల చేయకపోవడం దారుణమన్నారు. మానుకోట ప్రభుత్వ జూనియర్ కళాశాలకు నూతనభవనం నిర్మించాలని డిమాండ్ చేశారు. నాయకులు సింహాద్రి, అమీర్, ఉదయ్, వీరేందర్, శృతి, తదితరులు పాల్గొన్నారు.

వ్యాధులు ప్రబలకుండా జాగ్రత్తలు పాటించాలి



మాట్లాడుతున్న వడ్డెబోయిన శ్రీనివాస్

నెహ్రూసెంటర్: మహబూబాబాద్‌లో డెంగీ కేసులు నమోదవుతున్నందున సీజనల్ వ్యాధులు ప్రబలకుండా జాగ్రత్తలు పాటించాలని సబ్ యూనిట్ ఆఫీసర్ వడ్డెబోయిన శ్రీనివాస్ అన్నారు. ఆశా డే కార్యక్రమాన్ని మంగళవారం యూపీహెచ్‌సీలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. దోమల వల్ల వ్యాప్తి విస్తృతంగా వ్యాప్తి చెందుతాయని, మురుగునీరు నిల్వలేకుండా చర్యలు తీసుకోవాలన్నారు. జ్వరబాధితులు ప్రభుత్వ ఆస్పత్రిలో పరీక్షలు చేయించుకుని చికిత్స పొందాలన్నారు. సమావేశంలో డాక్టర్ మౌనిక, పీడీఎంఓ నర్మద, దీపిక, గోపిచంద్, పుష్పలీల, శ్రీనివాస్, మహేశ్వరీ, అరుణ పాల్గొన్నారు.

ఉపాధి కల్పించాలి

తొర్రూరు రూరల్: గ్రామీణ ప్రాంతాలకు చెందిన గొల్ల, కురుమలకు ఉపాధి కల్పించాలని గొర్రెల, మేకల పెంపకందారుల సంఘం జిల్లా కార్యదర్శి బొల్లం అశోక్ డిమాండ్ చేశారు. మంగళవారం మండలంలోని మాటేడు, పోలెపల్లి గ్రామాల్లో సంఘం సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా అశోక్ మాట్లాడుతూ గొల్ల, కురుమలకు చెందిన యువత ఉన్నత చదువులు చదువుకోని ఉద్యోగాలు లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, వారికి ఉపాధి కల్పించేందుకు షెడ్లు, గొర్రెలు, మేకలను రాయితీతో రుణాలు అందించాలని డిమాండ్ చేశారు. బొల్లం వెంకన్న, పెద్దబోయిన రాంమూర్తి, యాకయ్య, యాకయ్య, సాయికుమార్, లింగయ్య, రాములు, ఉప్పలయ్య, విష్ణు, రాకేష్ పాల్గొన్నారు.

సంక్షిప్త సమాచారం..

చెక్కు అందజేత

చిన్నగూడూరు: మండలంలోని జయ్యారం గ్రామానికి చెందిన ఎడెల్లి వెంకటమ్మకు మంజూరైన రూ.60వేల సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కును కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు మారబోయిన వెంకటేశ్వర్లు మంగళవారం అందజేశారు. కార్యక్రమంలో నాయకులు అప్పనబోయిన కృష్ణ, సందెనబోయిన ఉపేందర్, బండి లోకేష్, దుండిగాల ఏకాంబ్రం పాల్గొన్నారు.

ఆర్థిక సాయం

కేసముద్రం: మున్సిపాలిటీ పరిధి సబ్‌స్టేషన్‌తండాకు చెందిన బానోత్ పీరియా ఇటీవల అనారోగ్యంతో మృతి చెందాడు. ఈ మేరకు మానుకోట నియోజకవర్గ యువజన కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి బాదావత్ పవన్ కల్యాణ్‌నాయక్ మంగళవారం బాధిత కుటుంబానికి, రూ.6 వేలు అందించారు. గుగులోతు శివుడు, సుక్యనాయక్, గుగులోతునరేష్, విజయ్‌నాయక్ తదితరులు పాల్గొన్నారు.

50 శాతం టారిఫ్ సరికాదు

కేసముద్రం: అమెరికా విధించిన 50 శాతం టారిఫ్‌లను వెనక్కి తీసుకోవాలంటూ ఇనుగుర్తి మండల కేంద్రంలోని బస్టాండ్ సెంటర్‌లో సీఐటీయూ ఆధ్వర్యంలో మంగళవారం నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆ సంఘం గౌరవ అధ్యక్షుడు బోళ్ల రాములు, మండల కార్యదర్శి జల్లె జయరాజ్ మాట్లాడారు. అమాలీ, ప్రభాకర్, దామా, వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు కేటాయించాలి

మహబూబాబాద్ అర్బన్: జిల్లాలో అర్హులైన, దళిత జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు కేటాయించాలని జిల్లా దళిత వర్కింగ్ జర్నలిస్టు అధ్యక్షుడు కట్కూరి ప్రసాద్ కోరారు. జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ మెడికల్, నర్సింగ్ కళాశాల హాస్టల్స్ భవనాలు ప్రారంభానికి మంగళవారం వచ్చిన వైద్య ఆరోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహాకు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షుడు ప్రసాద్ మాట్లాడుతూ.. జిల్లాలో అర్హులైన జర్నలిస్టులకు గౌరవ వేతనం అందించాలని, సీనియర్ జర్నలిస్టులకు పింఛన్ సౌకర్యం కల్పించాలని కోరారు. ప్రైవేట్, కార్పొరేట్ ఆస్పత్రుల్లో ఉచిత వైద్యం, ప్రైవేట్ పాఠశాలలో షరతులు లేకుండా ఉచిత విద్య అందించాలని కోరారు. కార్యక్రమంలో ధర్మరపు శ్రీను, యాకాంబ్రం, కిరణ్ కుమార్, మహేష్, తిరుమలేష్, తదితరులు పాల్గొన్నారు.

మాలల అస్తిత్వాన్ని దెబ్బతీయొద్దు

తొర్రూరు: మాలల అస్తిత్వాన్ని దెబ్బతీసేలా రాష్ట్ర ప్రభుత్వ చర్యలు ఉన్నాయని మాల మహానాడు జిల్లా అధ్యక్షుడు చిట్టిమళ్ల మహేష్ అన్నారు. డివిజన్ కేంద్రంలో మంగళవారం మాలమహానాడు ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించారు. యూత్ నాయకుడు యనమల రాకేష్ అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో మహేష్ మాట్లాడారు. ఎస్సీ వర్గీకరణతో మాలలకు అన్యాయం చేసిన ప్రభుత్వం, జీఓ 99 తీసుకొచ్చి మాల విద్యార్థుల భవిష్యత్‌ను అంధకారంలోకి నెట్టిందన్నారు. జీఓను వెనక్కితీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు నీరటి మహేష్, చిట్టిమళ్ల గోపి, యనమల మనోజ్, రవి, అనిల్, లక్ష్మణ్, రాము, ప్రవీణ్, తదితరులు పాల్గొన్నారు.

గెలుపే లక్ష్యంగా పనిచేద్దాం

పెద్దవంగర: వచ్చే స్థానిక సంస్థల ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా నాయకులు, కార్యకర్తలు సమన్వయంతో పని చేయాలని కాంగ్రెస్ మండల అధ్యక్షుడు ముద్దసాని సురేష్ అన్నారు. మంగళవారం మండలంలోని చిట్యాలలో ఎంపీటీసీ క్లస్టర్ ఇన్‌చార్జ్ రవీందర్ రెడ్డి ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించగాజజ సురేష్ మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రవేశ పెట్టిన సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించాలని తెలిపారు. కార్యక్రమంలో ఏఎంసీ డైరెక్టర్ గోపాల్ నాయక్, కల్పన రాజుయాదవ్, సౌజన్య నగేష్, వెంకట రంగారావు, సీతారాం నాయక్, శ్యామ్, లక్ష్మయ్య, లింగమూర్తి, మహేష్, సత్యనారాయణ, రజినీకాంత్ పాల్గొన్నారు.

కాంగ్రెస్‌ను నిలదీయాలి

పెద్దవంగర: ఆరు గ్యారంటీల అమలుపై కాంగ్రెస్ ప్రభుత్వాన్ని నిలదీయాలని బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు ఈదురు ఐలయ్య పేర్కొన్నారు. మంగళవారం మండలంలోని లొట్లబండ తండాలో బీఆర్‌ఎస్ నాయకులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. తండాలను గ్రామ పంచాయతీలుగా చేసిన ఘనత బీఆర్‌ఎస్‌దేనని గుర్తు చేశారు. పాలనలో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలమైందని విమర్శించారు. కార్యక్రమంలో నాయకులు పాకనాటి సునిల్ రెడ్డి, శ్రీరాం సుధీర్, విజయ్‌పాల్ రెడ్డి, కాసాని హరీష్, దుంపల వేణు, తదితరులు పాల్గొన్నారు.

కేంద్రమే బాధ్యత వహించాలి

నెహ్రూసెంటర్: రాష్ట్రంలో యూరియా కొరతకు కేంద్ర ప్రభుత్వమే బాధ్యత వహించాలని సంయుక్త కిసాన్ మోర్చా (ఎస్‌కేఎం) జిల్లా కన్వీనర్ గుజ్జు దేవేందర్ అన్నారు. జిల్లా కేంద్రంలో ఎస్‌కేఎం సమావేశం భాస్కర్‌రెడ్డి అధ్యక్షతన మంగళవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. రైతు, ప్రజా వ్యతిరేక విధానాలను కేంద్రం మానుకోవాలని డిమాండ్ చేశారు. దేశంలో దిగుమతులపై మోదీ సుంకాలను ఎత్తివేయడం సామ్రాజ్యవాద దేశాలకు తలొగ్గడమేనని విమర్శించారు. సమావేశంలో మేక వీరన్న, ముల్కురు జగ్గన్న, నల్లపు సుధాకర్, ఆవుల కట్టన్న తదితరులు పాల్గొన్నారు.

ఇన్‌చార్జ్ కమిషనర్‌గా రాజేశ్వర్

కేసముద్రం: మహబూబాబాద్ మున్సిపల్ కమిషనర్ రాజేశ్వర్‌ను కేసముద్రం మున్సిపాలిటీ ఇన్‌చార్జ్ కమిషనర్‌గా నియమిస్తూ డైరెక్టర్ ఆఫ్ మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ శ్రీదేవి మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఇక్కడ కమిషనర్‌గా పనిచేస్తున్న ప్రసన్నరాణి వ్యక్తిగత పని నిమిత్తం అమెరికాకు వెళ్తుండడడంతో రాజేశ్వర్‌ను నియమించినట్లు పేర్కొన్నారు.

సాంకేతికతపై పట్టు సాధించాలి

డోర్నకల్: విద్యార్థులు ప్రాథమికస్థాయి నుంచే సాంకేతిక పరిజ్ఞానంపై పట్టు సాధించాలని మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ కృష్ణభాను అన్నారు. స్థానిక మోడల్ స్కూల్‌లో మంగళవారం హైదరాబాద్‌కు చెందిన సాహం అకాడమీ ఆధ్వర్యంలో రోబోటిక్స్ ఇన్ అకాడమిక్స్ కార్యక్రమం నిర్వహించారు. 8, 9వ తరగతి విద్యార్థులకు ఎల్‌ఈడీ లైట్ల తయారీ, పని చేసే విధానం, రోబోటిక్స్ బేసిక్స్ తదితర అంశాల గురించి సంస్థ ప్రతినిధులు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ కృష్ణభాను మాట్లాడుతూ.. విద్యార్థులకు సాంకేతిక పరిజ్ఞానంపై పట్టు కల్పించేందుకు సాహం అకాడమి ఆధ్వర్యంలో అనేక పాఠశాలల్లో అవగాహన సదస్సులు నిర్వహించడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో ఫిజిక్స్ అధ్యాపకుడు ఆనంద్, అకాడమి ప్రతినిధి పవన్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.